మళ్లీ ముంపు ప్రమాదం

- నంగివలస చెరువు చుట్టూ ఉన్న నివాసితుల ఆందోళన
- శాశ్వత పరిష్కారం చూపాలని వేడుకోలు



తాత్కాలిక ఉపశమనంగా డ్రైనేజీపై తొలగించిన పలకలు



సంగివలస చెరువుకు అనుసంధానంగా ఉన్న డ్రైనేజీని పరిశీలిస్తున్న నేషనల్ హైవే సిబ్బంది

తగరపువలస : జీవీఎంసీ భీమిలి జోన్ రెండో వార్డు సంగివలస చెరువు చుట్టూ ముంపు సమస్య స్థానికులకు మళ్లీ ఆందోళన కలిగిస్తోంది. చెరువు ఇన్‌ఫ్లో, అవుట్‌ఫ్లో నిర్మాణంలో లోపాల కారణంగా సంగివలస చుట్టుపక్కల గ్రామాల్లో కురిసిన వర్షం నీరు చెరువులోకి ప్రవేశించలేక సర్వీస్‌రోడ్డులో నిలిచిపోతోంది. దీంతో వర్షం కురిసిన ప్రతీ సారి వాహనాలు ఈ సర్వీస్ రోడ్డులోని వర్షం నీటిలో మొరాయిస్తున్నాయి. అలాగే సంగివలస కాలనీని ఆనుకుని పల్లానికి వర్షం నీరు వెళ్లే అవకాశం లేకుండా వాకింగ్ ట్రాక్ నిర్మాణం చేపట్టడం వల్ల ఎక్కువైన చెరువు నీరు నిండుకుండలా ఉండిపోతోంది. ఐదేళ్ల క్రితం చెరువు అభివృద్ధి పనుల్లో భాగంగా చుట్టూ వాకింగ్ ట్రాక్ నిర్మాణం చేపట్టినప్పుడు జీవీఎంసీ, నేషనల్ హైవే విభాగాల మధ్య సమన్వయ లోపం కారణంగా చెరువు చుట్టూ నివసిస్తున్న వారు తరచూ ముంపు సమస్యతో ఇబ్బందులు పడుతున్నారు. చెరువుకు, జాతీయ రహదారి మధ్యకు ఉన్న సర్వీస్‌రోడ్డు, డ్రైనేజీ పల్లంగా ఉండటం వల్ల వర్షం నీరు చెరువులోకి వెళ్లలేక రోజుల తరబడి సర్వీస్ రోడ్డుపై నిలిచిపోతోంది.

తాత్కాలిక పనులతో ఉపశమనం శూన్యం

వర్షాకాలంలో జీవీఎంసీ, నేషనల్ హైవే విభాగాల సిబ్బంది జేసీబీలతో వచ్చి డ్రైనేజీలో ఎక్కడో ఒకచోట పూడిక తీసి వెళ్లిపోతున్నారు. వాస్తవానికి ఈ ప్రాంతంలో నేషనల్ హైవే విభాగం డ్రైనేజీలపై పలకలు కాకుండా మొత్తం శ్లాబు వేసి వదిలేశారు. శ్లాబు సమయంలో కింద ఉంచిన కర్రలు, మట్టి తొలగించకపోవడంతో వాటితోనే అవి నిండిపోయాయి. దీంతో వర్షం నీరు డ్రైనేజీలోకి వెళ్లే అవకాశం పూర్తిగా తగ్గిపోయింది. జాతీయ రహదారి వైపు చెరువు గట్టుపై వాకింగ్ ట్రాక్ ఎత్తు తగ్గించి డ్రైనేజీలో నీటిని అందులోకి వెళ్లేలా ఆధునికీకరించాలని ఇక్కడి రైతులు కోరుతున్నారు. అలాగే సంగివలస కాలనీ వైపు అవుట్ ఫ్లో సులభంగా సాగేలా వాకింగ్ ట్రాక్ ఎత్తు తగ్గించాలని కోరుతున్నారు. దీనివల్ల ఎప్పటికప్పుడు అవుట్‌ఫ్లో నియంత్రించడం వల్ల తమ పంట పొలాలు ముంపునకు గురికాకుండా కాపాడుకోవచ్చని రైతులు అంటున్నారు. చెరువు చుట్టూ బండి నిర్మాణం, వాకింగ్ ట్రాక్ ఏర్పాటులో లోపాల కారణంగా సంగివలస గ్రామాల నుంచి కూడా సాధారణ రోజుల్లో మురుగు, వర్షాకాలంలో వర్షం నీరు రోజుల తరబడి నిలిచిపోతుందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. చెరువు చుట్టూ వున్న పంట పొలాలు, నివాసాలను దృష్టిలో పెట్టుకుని శాశ్వత పరిష్కారం చూపాలని కోరుతున్నారు.

పాలిథిన్ వినియోగంతో దుష్పరిణామాలు



భీమిలిలో ర్యాలీ నిర్వహిస్తున్న ఛాత్రోపాధ్యాయులు

భీమునిపట్నం : ప్లాస్టిక్ సంచులు వినియోగించడం వల్ల ఎంతో నష్టం జరుగుతోందని, తీవ్ర దుష్పరిణామాలకు దారి తీస్తుందని స్థానిక జిల్లా విద్య శిక్షణ సంస్థ (డైట్) ప్రిన్సిపాల్ ఎం.జ్యోతి కుమారి అన్నారు. అంతర్జాతీయ పాలిథిన్ సంచుల రహిత దినోత్సవం సందర్భంగా ఛాత్రోపాధ్యాయులు బుధవారం నిర్వహించిన కార్యక్రమంలో ఆమె పాల్గొన్నారు. ప్లాస్టిక్ సంచుల వల్ల పర్యావరణానికి పెను ముప్పు వాటిల్లుతోందని, ఇది అత్యంత ఆందోళనకర విషయమన్నారు. అందరూ వీటిని వినియోగించిన తర్వాత పడేయడంతో నేలలో కలిసిపోకుండా వుండిపోతున్నాయన్నారు. అలా అవి నేలలో పరుచుకుపోవడంతో వర్షం నీరు భూమిలోకి ఇంకదని, తద్వారా భూగర్భ జలాల పెరుగుదల నిలిచిపోతుందన్నారు. దీనివల్ల భవిష్యత్‌లో తీవ్ర నీటి ఎద్దడి ఏర్పడుతుందని ఆందోళన వ్యక్తం చేశారు. ఇప్పటికే చాలా ప్రాంతాల్లో నీటి సమస్య తీవ్రంగా వుందన్నారు. ఈ సమస్య పరిష్కారానికి అందరూ ముందుకు రావాలని, గుడ్డ, నార సంచులను వినియోగించాలని కోరారు. ఈ సందర్భంగా ఛాత్రోపాధ్యాయులు భీమిలి మెయిన్ రోడ్డు పెద్దబజారు ప్రాంతంలో ర్యాలీ నిర్వహించారు. అధ్యాపకులు ఎల్.సుధాకర్, జి.నాగేశ్వరరావు, జి.మాధవి, ఎస్.త్రినాథరావు పాల్గొన్నారు.

పర్యావరణంపై తీవ్ర ప్రభావం

తగరపువలస : పాలిథిన్ సంచుల విచ్చలవిడి వినియోగం పర్యావరణంపై తీవ్ర ప్రభావం చూపుతుందని జీవీఎంసీ భీమిలి జోన్ ఒకటో వార్డు బంగ్లామెట్ట ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయుడు రెడ్డిపల్లి అప్పలరాజు అన్నారు. బుధవారం అంతర్జాతీయ పాలిథిన్ సంచుల రహిత దినోత్సవం సందర్భంగా విద్యార్థులకు అవగాహన కల్పించారు. పాలిథిన్ సంచులు నాశనం కావడానికి వందల ఏళ్ల సమయం పడుతుందన్నారు. అడవి, సముద్ర జీవులకు ఇవి హాని కలిగిస్తున్నాయన్నారు. కాగితపు, జనపనార, గుడ్డతో తయారైన సంచులు వినియోగించాలని కోరారు. ఉపాధ్యాయులు నరహరిశెట్టి రమేష్, బుగత మల్లిక, తదితరులు పాల్గొన్నారు.

సీజనల్ వ్యాధులపై అప్రమత్తత అవసరం



అవగాహన కార్యక్రమంలో మాట్లాడుతున్న జెడ్సీ శైలజావల్లి

కొమ్మాది : సీజనల్ వ్యాధులపై ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా ఉండాలని జోన్ – 2 జోనల్ కమిషనర్ శైలజావల్లి సూచించారు. జీవీఎంసీ 8వ వార్డు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వద్ద డయేరియా, డెంగ్యూ, మలేరియా వ్యాధులపై విద్యార్థులకు బుధవారం అవగాహన కల్పించారు. వ్యక్తిగత శుభ్రతతోపాటు పరిసరాల పరిశుభ్రతను పాటించాలన్నారు. ఏమాత్రం అనారోగ్య సమస్యలు తలెత్తినా వెంటనే వైద్యులను సంప్రదించాలని తెలిపారు. కార్యక్రమంలో ఏఎంవోహెచ్ ఎన్.కిషోర్, మలేరియా విభాగం ఇన్‌స్పెక్టర్ మంగరాజు, శానిటరీ ఇన్‌స్పెక్టర్ రవి పాల్గొన్నారు.

క్లుప్తంగా

తాగునీరివ్వని కుళాయిలు

తగరపువలస : భీమిలి మండలం మజ్జివలస గ్రామ పంచాయతీలో గ్రామీణ నీటి సరఫరా విభాగం సిబ్బంది నిర్వాకం కారణంగా ఎనిమిది నెలలుగా రెండు లైన్లలోని వీధి కుళాయిల దారా తాగునీరు రావడం లేదని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. జలజీవన్ మిషన్ పథకంలో భాగంగా కొత్తలైన్ల నిర్మాణం కూడా పూర్తయిందని అంటున్నారు. పంచాయతీలో విశ్వనాథరాజు, కృష్ణంరాజు నివాసాల వైపు, మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల వైపు లైన్లలో వీధి కుళాయిలను వెంటనే పురుద్ధరించి తాగునీరు అందించాలని కోరుతున్నారు.

6 నుంచి జగన్నాథస్వామి రథోత్సవాలు



జగన్నాథ స్వామి

భీమునిపట్నం : భీమిలిలోని జగన్నాథ స్వామి రథోత్సవ మహోత్సవాలు ఈ నెల 6 నుంచి 17 వరకు ఘనంగా నిర్వహించనున్నట్లు అర్చకులు ఆర్.కృష్ణమాచార్యులు తెలిపారు. 6న స్వామి వారి నేత్రోత్సవం, కల్యాణం ఘనంగా నిర్వహిస్తామని తెలిపారు. 7న వార్షిక తొలిపూజ, జగన్నాథుని రథయాత్ర భక్తుల సహకారంతో వైభవంగా నిర్వహిస్తామన్నారు. తర్వాత రోజు నుంచి రోజూ స్వామి వారు వరుసగా వేదపురుషావతారం, మత్స్యావతారం, శ్రీకూర్మావతారం, వరాహావతారం, నరసింహావతారం, పరశురామావతారం, శ్రీకృష్ణావతారం, ఆఖరు రోజు 17న శేషశయనావతారంలో దర్శనమిస్తారని తెలిపారు. అదే రోజు సాయంత్రం మారు రథోత్సవం నిర్వహిస్తామని వెల్లడించారు.

కుటుంబ కలహాలతో వ్యక్తి ఆత్మహత్య

కొమ్మాది : కుటుంబ కలహాలతో ఓ వ్యక్తి ఆత్మహత్య చేసుకున్న సంఘటన ఎండాడలో చోటు చేసుకుంది. జీవీఎంసీ 8వ వార్డు ఎండాడ దరి రామాలయం వీధిలో భార్య, ముగ్గురు పిల్లలతో పడగ సతీష్ నివసించేవారు. సతీష్ గ్యాస్ ఏజెన్సీలో డెలివరీ బాయ్‌గా పనిచేస్తున్నారు. కొన్నాళ్ల నుంచి కుటుంబంలో చిన్న చిన్న తగాదాలు జరుగుతున్నాయి. ఈ క్రమంలో బుధవారం సతీష్ భార్య దేవి అదే ఊరిలో ఉంటున్న అమ్మగారి ఇంటికి వెళ్లింది. తిరిగి వచ్చి చూసేసరికి సతీష్ ఫ్యాన్‌కు ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. గమనించి వెంటనే కుటుంబ సభ్యులకు, పోలీసులకు తెలియజేసింది. ఆరిలోవ పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని కేసు నమోదు చేశారు. సతీష్ మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం కేజీహెచ్‌కు తరలించారు.

విద్యుత్ సరఫరాకు రేపు అంతరాయం

మధురవాడ : ఏపీ ట్రాన్స్‌కో మధురవాడ 33/11 కేవీ విద్యుత్ సబ్ స్టేషన్ శివశక్తినగర్ 11 కేవీ ఫీడర్ పరిధిలో నిర్వహణ, మరమ్మతులు చేపడుతున్న కారణంగా శుక్రవారం పలు ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని ఆపరేషన్స్ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ ఎస్‌వీఎస్ రామమూర్తి చెప్పారు. ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 2 వరకు మారికవలస ఆర్‌జీకే కాలనీ, వైఎస్సార్ కాలనీ, గాయత్రి విద్య హాస్పిటల్, కార్పెంటర్స్ కాలనీ, వికలాంగుల కాలనీ, శివశక్తినగర్ రోడ్డు, అయ్యప్పనగర్, శ్రీలక్ష్మినగర్, సద్గురు సాయినాథ కాలనీ, గణేష్‌నగర్ రోడ్డు పరిసర ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా నిలిచిపోతుంది. వినియోగదారులు గమనించి సహకరించాలని రామమూర్తి కోరారు.

పీఎం పాలెం: స్థానిక విద్యుత్ సబ్ స్టేషన్ పరిధిలోని 11 కేవీ రెవెన్యూ ఫీడర్ ఏరియాలో లైన్ల నిర్వహణ, చెట్ల కొమ్మల తొలగింపు పనులు చేపడుతున్నందున శుక్రవారం ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 3 వరకూ విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడుతుందని విశాఖ ఆపరేషన్ జోన్ – 3 ఈఈ పోలాకి శ్రీనివాసరావు తెలిపారు. ప్రకటించిన సమయంలో వేంకటేశ్వర స్వామి మెట్ట, కృషి షాపింగ్ మాల్ ఏరియా, రెవెన్యూ లే అవుట్ ఏరియా, శివాలయం, ఉడాకాలనీ ప్రాంతాలకు విద్యుత్ సరఫరా నిలిచిపోతుందని తెలిపారు.

భక్తి శ్రద్ధలతో సుబ్రహ్మణ్యస్వామి ఆలయ వార్షికోత్సవం



విశేష అలంకరణలో శ్రీ వల్లీ దేవసేన సహిత సుబ్రహ్మణ్యస్వామి

పీఎం పాలెం : స్థానిక ఆఖరు బస్టాపు ఉంచి బక్కన్నపాలెంకు వెళ్లే రోడ్డులో గల శ్రీ శృంగేరీ శంకరమఠంలో నెలకొల్పిన శ్రీ వల్లీ దేవసేన సహిత సుబ్రహ్మణ్యస్వామి ఆలయ వార్షికోత్సవం బుధవారం ఘనంగా నిర్వహించారు. మఠం గౌరవ పాలనా ప్రతినిధి జగర్లపూడి వెంకటేశ్వర్లు పర్యవేక్షణలో సుబ్రహ్మణ్యస్వామికి ప్రత్యేక అభిషేకాలు, అర్చనలు నిర్వహించారు. స్వామికి సుగంధ విభూతి అభిషేకం అనంతరం భక్తులకు దర్శనం కల్పించారు. ఉత్సవంలో భాగంగా శ్రీ వల్లీ దేవసేన సహిత సుబ్రహ్మణ్య స్వామిని వివిధ రకాల పుష్పాలతో సుందరంగా అలంకరించారు. ఆలయ మండపంలో సహస్ర నామార్చన, సుబ్రహ్మణ్య స్వామి హోమం నిర్వహించారు. అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

నీలి నాలుక వ్యాధి నివారణకు టీకాలు

మధురవాడ : నీలి నాలుక వ్యాధి నివారణకు జూలై 31 వరకు ఉచితంగా టీకాలు వేస్తామని చంద్రపాలెం పశు వైద్య శాఖ అధికారి ఆర్.అనుపమ చెప్పారు. జీవీఎంసీ 6వ వార్డు శంభువానిపాలెంలో బుధవారం టీకాలు వేశారు. ఈ వ్యాధి గొర్రెలకు ఒర్బి వైరస్, కులికైడస్ అనే కీటకం వల్ల వ్యాప్తి చెందుతుందన్నారు. నీలి నాలుక వ్యాధి సోకిన గొర్రెలకు ముఖం వాపుతో పుండు ఏర్పడుతుందన్నారు. గొర్రె మూతి, పెదవులు, చిగుళ్లు, నాలుక, వీపుపై కూడా పుండ్లు ఏర్పడతాయన్నారు. వ్యాధి ముదిరితే నాలుక నీలి రంగులోకి మారిపోతుందన్నారు. మేత సరిగా మేయక చనిపోయే ప్రమాదం ఉందన్నారు. రైతులు గొర్రెలకు ఖచ్చితంగా టీకాలు వేయించాలని సూచించారు.

పంట కాలువల్లో పేరుకుపోయిన పూడిక



తాటితూరు పంచాయతీలో పూడిక తొలగించని పోలిపల్లి కాలువ



కురపల్లిలో పూడిక తొలగించని కాలువ

- ఇలాగైతే చెరువులు నిండవని అన్నదాతల ఆందోళన

తగరపువలస : భీమిలి మండలంలోని గ్రామాల్లో పలు చెరువులకు అనుసంధానంగా ఉన్న పంట కాలువల్లో పూడికతీత పనులు జరగలేదు. కాలువలన్నీ తుప్పలు, మొక్కలతో నిండిపోయాయి. వర్షాకాలంలో మైదాన భూముల్లో కురిసిన వర్షం నీరు ఈ పంట కాలువల ద్వారా చెరువుల్లోకి చేరుతుంది. రైతులకు అవసరమైన సమయంలో చెరువు నుంచి తిరిగి పంట కాలువల ద్వారా నీటిని వ్యవసాయానికి వినియోగిస్తుంటారు. దీంతో చెరువులతోపాటు పంట కాలువల్లో కూడా వర్షాకాలానికి ముందు పూడికతీత పనులు చేపడుతుంటారు. వాస్తవానికి ఇరిగేషన్, వ్యవసాయశాఖ, పంచాయతీల భాగస్వామ్యంతో చేపట్టాల్సిన పూడికతీత పనులు జరగకపోడంతో అత్యవసర సమయంలో రైతులే పంట కాలువలను శుభ్రం చేసుకుంటున్నారు. ప్రస్తుతం రైతులపై వరుణుడి కరుణ పూర్తిగా కనిపించకపోవడంతో వీళ్లు కూడా పంట కాలువల వైపు చూడలేదు. ప్రస్తుత కూటమి ప్రభుత్వం రైతులకు ఇప్పటి వరకు పెట్టుబడి సాయం కూడా ప్రకటించకపోవడంతో రైతులు అయోమయంతో ఎదురు చూస్తున్నారు. కనీసం చెరువులు నిండటానికైనా పంట కాలువల్లో పూడిక తీసేలా అధికార యంత్రాంగం చర్యలు తీసుకోవాలని భీమిలి మండల రైతులు కోరుతున్నారు.

విద్యార్థులకు నగదు పారితోషికాలు



కిడ్డీ డిబ్బీలతో విద్యార్థులు

పద్మనాభం : పాండ్రంగిలోని అంగన్‌వాడీ, ప్రాథమిక, జిల్లా పరిషత్ పాఠశాల విద్యార్థులు 221 మందికి ప్రకృతి ఫౌండేషన్ తరపున ఇ.శ్రీకాంత్, మద్దాల కల్యాణపు నరిసింహరావు డబ్బులు దాచుకునేందుకు కిడ్డీ డబ్బాలు బుధవారం పంపిణీ చేశారు. గత ఏడాది పదో తరగతిలో అధిక మార్కులు సాధించిన ముగ్గురు విద్యార్థులకు ఒక్కొక్కరికి రూ.516 చొప్పున నగదు పారితోషికాలు అందజేశారు. అల్లూరి జయంతి సందర్భంగా ఈ కార్యక్రమాలు నిర్వహించారు. కార్యక్రమంలో హెచ్ఎం ఆర్.వి.గిరి, అనంత పద్మనాభస్వామి సేవా సంఘం అధ్యక్షుడు డి.గోపీబాబు, ఆర్.ఎస్.సత్యనారాయణరాజు పాల్గొన్నారు.

అప్పన్నకు విశేషంగా నిత్యకల్యాణం



అప్పన్న కల్యాణ ఉత్సవమూర్తులు

సింహాచలం: శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామికి బుధవారం నిత్యకల్యాణం విశేషంగా జరిగింది. స్వామివారి ఉత్సవమూర్తులు గోవిందరాజస్వామి, శ్రీదేవి, భూదేవిలను వేదికపై అధిష్టింపజేశారు. విష్వక్సేనపూజ,పుణ్యాహవచనం, సంకల్పం, కంకణ ధారణ, యజ్ఞోపవీతం, జీలకర్రబెల్లం, మాంగల్యధారణ, తలంబ్రాలు తదితర ఘట్టాలతో కల్యాణం నిర్వహించారు. ఉభయదాతలకు స్వామివారి ప్రసాదం,శేషవస్త్రాలు అందజేశారు.

స్టీల్‌ప్లాంట్ సమస్యలపై ప్రజాప్రతినిధులకు వినతులు

ఉక్కునగరం: స్టీల్‌ప్లాంట్ రక్షణకు సెయిల్‌లో విలీనం, ముడి పదార్థాల లభ్యత తదితర అంశాలపై ఉక్కు పరిరక్షణ పోరాట కమిటీ నాయకులు ప్రజాప్రతినిధులను కలవనున్నారు. అంబేడ్కర్ కళాక్షేత్రంలో బుధవారం నిర్వహించిన పోరాట కమిటీ సమావేశంలో ఈ మేరకు తీర్మానించారు. సాధ్యమైనంత త్వరలో టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు, గాజువాక ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావు నేతృత్వంలో విశాఖ ఎంపీ భరత్, అనకాపల్లి ఎంపీ సీఎం రమేష్‌లను కలిసి సమస్యలను వివరించనున్నారు. నూతనంగా కూటమి ప్రభుత్వం ఏర్పడిన నేపథ్యంలో ముఖ్యమంత్రి చంద్రబాబు, ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్‌లను మర్యాదపూర్వకంగా కలవాలని నిర్ణయించారు. బీజేపీ రాష్ట్ర అధ్యక్షురాలు పురందేశ్వరి, కేంద్ర ఉక్కు సహాయమంత్రి బి. శ్రీనివాసవర్మ, విశాఖ నార్త్ ఎమ్మెల్యే విష్ణుకుమార్ రాజు, పెందుర్తి ఎమ్మెల్యే పంచకర్ల రమేష్ బాబులను కలవనున్నారు. ఈ సందర్భంగా హైకోర్టులో స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా వేసిన కేసు వివరాలను వెల్లడించారు.

రోడ్డుపై పార్కింగ్‌తో ట్రాఫిక్ జామ్



మధురవాడ జోనల్ కార్యాలయం వద్ద రోడ్డుపై నిలిపిన వాహనాలు

మధురవాడ : జీవీఎంసీ మధురవాడ జోన్ – 2 కార్యాలయం వద్ద సర్వీసు రోడ్డులో వాహనాలు నిబంధనలకు విరుద్ధంగా పార్కింగ్ చేసేయడంతో తరచూ ట్రాఫిక్ జామ్ అవుతోంది. సోమ, శనివారం రోజులతోపాటు రోజూ ఉదయం, సాయంత్రం వాహనచోదకులు ఇబ్బందులు పడుతున్నారు. ముఖ్యంగా వాహనాలను అస్తవ్యస్తంగా పార్కింగ్ చేసి వెళ్లిపోవడంతో ట్రాఫిక్ నిలిచిపోతోంది. ఇలాంటి సమస్య తరచూ తలెత్తుతున్నా రోడ్డుపై వాహనాలు నిలపకుండా పోలీసులు, జీవీఎంసీ అధికారులు కనీస చర్యలు చేపట్టడం లేదు. దీంతో ఆ మార్గంలో రాకపోకలు సాగించే వాహనదారులు, జోనల్ కార్యాలయానికి వచ్చే వారు, చంద్రంపాలెం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఉన్నతాధికారులైనా తక్షణమే స్పందించి ట్రాఫిక్ నియంత్రణకు చర్యలు చేపట్టాలని స్థానికులు కోరుతున్నారు.

పటిష్ట చర్యలతోనే డెంగ్యూ నివారణ

డాబాగార్డెన్స్: రానున్న వర్షాకాలంలో డెంగ్యూ జ్వరాలు వ్యాప్తి చెందకుండా పటిష్టమైన చర్యలు చేపట్టాలని స్టేట్ మలేరియా డిప్యూటీ డైరెక్టర్ డాక్టర్ రామనాథం జిల్లా అధికారులను ఆదేశించారు. నగరంలో డెంగ్యూ ప్రభావిత ప్రాంతాలైన జబ్బరితోట, రంగిరీజు వీధి ప్రాంతాల్లో బుధవారం ఉదయం క్షేత్రస్థాయిలో పర్యటించారు. డెంగ్యూ జ్వర బాధితుల ఇళ్లకు వెళ్లి పరామర్శించారు. డెంగ్యూ జ్వరాలను వ్యాప్తి చేసే ఈడిస్ దోమల నియంత్రణకు చేపడుతున్న యాంటీ లార్వా ఆపరేషన్, ఫాగింగ్, స్ప్రేయింగ్, చికిత్స, అవగాహన కార్యక్రమాలు తదితర అంశాలను పరిశీలించారు. అనంతరం ఉత్తరాంధ్ర జిల్లాల మలేరియా విభాగం అధికారులతో సమావేశమయ్యారు. డెంగ్యూ జ్వరాలను అదుపు చేయడానికి చేపట్టాల్సిన చర్యలు, కార్యాచరణ ప్రణాళికపై చర్చించారు. ఈ కార్యక్రమంలో విశాఖ జిల్లా మలేరియా విభాగం అధికారి తులసీరాజ్, జీవీఎంసీ బయాలజిస్ట్ సాంబమూర్తి, సబ్ యూనిట్ ఆఫీసర్ నగేష్ పట్నాయక్, ఎంపీహెచ్ఈవో శేషుబాబు, ఇతర మలేరియా విభాగం సిబ్బంది, జీవీఎంసీ ఉద్యోగులు పాల్గొన్నారు.

రోడ్డుపై ప్రమాదకరంగా గొయ్యి



పాట్నూరు రోడ్డుపై గొయ్యి

పద్మనాభం : మండలంలోని రెడ్డిపల్లి నుంచి పాట్నూరు వెళ్లే ఆర్అండ్‌బీ రోడ్డు షిరిడీ సాయిబాబా ఆలయం సమీపంలో గొయ్యి ఏర్పడింది. దీంతో ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఈ రోడ్డు మీదుగా పాట్నూరు, విజయనగరం జిల్లా జామి మండలం కుమరాం, భీమసింగి ప్రాంతాలకు ప్రయాణికులు ఆటోలు, ద్విచక్ర వాహనాలపై రాకపోకలు సాగిస్తుంటారు. వాహన చోదకులు ఈ గోతుల్లో పడి ప్రమాదాలకు గురవుతున్నారు. వర్షాలకు క్రమేపీ ఈ గొయ్యి పెద్దదవుతోంది. సంబంధిత అధికారులు తక్షణమే స్పందించి గొయ్యి పూడ్చేందుకు చర్యలు చేపట్టాలని వాహన చోదకులు కోరుతున్నారు.

కంటి శస్త్ర చికిత్సల్లో శంకర్ ఫౌండేషన్ ప్రగతి

సింహాచలం: ఈ ఏడాది ఏప్రిల్ నుంచి జూన్ వరకు శంకర్ ఫౌండేషన్ కంటి ఆస్పత్రి అత్యధిక శస్త్రచికిత్సలు చేసి ప్రజల కళ్లల్లో వెలుగులు నింపిందని ఆస్పత్రి డిప్యూటీ జనరల్ మేనేజర్ బంగార్రాజు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉత్తరాంధ్ర జిల్లాల్లో నాణ్యమైన కంటి వైద్యలు అందిస్తున్న నాయుడుతోటలోని శంకర్ ఫౌండేషన్ కంటి ఆస్పత్రిలో గడిచిన ఏప్రిల్ నుంచి జూన్ వరకు 8,839 కంటి శస్త్రచికిత్సలు చేసినట్టు పేర్కొన్నారు. అలాగే 50,555 మంది ఔట్ పేషెంట్లకు సేవలందించడం జరిగిందన్నారు. రెటీనా, రెటీనా ఇంజెక్షన్లు, గ్లకోమా, కార్నియా, పీడియాట్రిక్ కంటి వైద్యం, ఆర్బిట్ అక్యూలో ప్లాస్టీ విభాగాల్లో మంచి ప్రగతి సాధించిందన్నారు. సామాజిక కంటి వైద్య సేవల్లో భాగంగా ఉత్తరాంధ్ర జిల్లాల్లో 130 ఉచిత కంటి వైద్య శిబిరాలు నిర్వహించడంతో పాటు 3,265మందికి కంటి శస్త్రచికిత్సలు చేసి గమ్య స్థానాలకు చేరవేశామన్నారు. అద్భుతంగా సేవలందించిన వైద్యులు, సిబ్బందిని శంకర్ ఫౌండేషన్ ట్రస్టీస్ ఆత్మకూరు కృష్ణకుమార్, ఆత్మకూరు విజయ్‌కుమార్, జనరల్ మేనేజర్ కె.రాధాకృష్ణన్ అభినందించారు.

సుప్రసిద్ధ రచయిత బలివాడ

సీతంపేట: సహృదయ సాహితి సంస్థ ఆధ్వర్యంలో బుధవారం రాజేంద్రనగర్ ప్రిజమ్ కళాశాలలో జరిగిన కవి సమ్మేళనంలో వైవిధ్యభరితమైన కవితలు చదివి అందరినీ అలరించారు. రచయిత బలివాడ కాంతారావు జయంతి సందర్భంగా డాక్టర్ కె.జి.వేణు మాట్లాడుతూ తెలుగు నవల, కథా సాహిత్య చరిత్రలో తనకంటూ ప్రత్యేకమైన అధ్యాయాన్ని సృష్టించుకున్న సుప్రసిద్ధ రచయిత బలివాడ కాంతారావు అని పేర్కొన్నారు. బాల్యంలోనే స్కూల్ మ్యాగజైన్‌కు సంపాదకుడిగా పనిచేసిన ఘనత ఆయనదని తెలిపారు. బలివాడ 38 నవలలు, 400 వరకు కథలు, 5 నాటికలు, మరెన్నో రేడియో నాటికలు రాశారన్నారు. నిజాయితీ, నిక్కచ్చితనం, జాలి, దయ, కరుణ ఆయన రచనల్లో ప్రస్ఫుటంగా కనిపించేవని చెప్పారు. శేఖరమంత్రి ప్రభాకర్ మాట్లాడుతూ తెలుగు వారు గర్వించదగ్గ రచయిత బలివాడ కాంతారావు అని కొనియాడారు. రచయితలు, కవులు డి.వి.సూర్యారావు, ఎస్.విజయ్‌కుమార్, సీహెచ్ చిన సూర్యనారాయణ కవితలు చదివి వినిపించారు.